# వంద రోజుల వంచన



జనవరి 7న ఆచంటలో నిర్వహించిన సమావేశంలో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు (ఫైల్)



సూపర్ సిక్స్, నియోజకవర్గ హామీలను తెలుపుతూ పితాని ఇంటర్వ్యూ (ఫైల్)

- నియోజకవర్గంలో ముందుకు కదలని అభివృద్ధి
- మాటలే తప్ప హామీలపై నోరు మెదపని ఎమ్మెల్యే పితాని

**పెనుగొండ:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా హామీల నిలబెట్టుకోవడానికి అడుగు ముందుకు పడలేదు. అమరావతి నుంచి ఆచంట నియోజక వర్గం వరకూ ఇదే పరిస్థితి. ఎన్నికల్లో ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చినా చిన్నా చితక పనులు తప్ప ప్రధాన హామీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల శంఖారావం పూరిస్తూ జనవరి 7న ఆచంటలో రా..కదలిరా అంటూ భారీ సభ నిర్వహించి చంద్రబాబు, పితాని సత్యనారాయణలు ఆచంటలో ఊకదంపుడుగా ఇచ్చిన హామీలు అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఎన్నికలకు ప్రధాన హామీగా నిలుస్తున్న అయోధ్యలంక వారధి కలగానే మిగిలిపోయింది. ఆచంట మండలం కోడేరు నుంచి కోనసీమ జిల్లా పి.గన్న వరం వరకూ గోదావరిపై వారధి నిర్మిస్తాం అన్న మాటలు గోదావరి వరదలో కొట్టుకుపోయింది. ఇప్పటి వరకూ కనీసం వారధి నిర్మాణం కనీసం ప్రతిపాదనలకు నోచుకోలేదు.

**అయోధ్యలంక తాగునీటిపైనా అదే తీరు**

అదేవిధంగా చుట్టూ గోదావరి ఉన్నా తాగునీటికి కటకటలాడే అయోధ్యలంకలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చంద్రబాబు, పితానిలు హామీ ఇచ్చినా ఇప్పటికీ తాగునీటికి లంక గ్రామాల ప్రజలు అల్లాడుతున్నామంటూ లంకవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరదల్లో పర్యటించిన చంద్రబాబు, పితానిలు బురద నీరు తాగుతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తాగునీటి సరఫరా చేస్తామంటూ చేసిన ప్రకటనలు గాలిలో కలిసిపోయాయి.

**అగ్నిమాపక కేంద్రం ఎక్కడ?**

ఆచంట నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో పాలకొల్లు నుంచి అగ్నిమాపక కేంద్రం వచ్చే లోపునే ప్రమాదం జరిగి బూడిద మిగులుతుంది. ప్రతి ఎన్నికల్లోనూ అగ్నిమాపకం కేంద్రం హామీగానే నిలిచిపోతుంది. గత ప్రభుత్వంలో అక్షర రూపం దాల్చింది. కానీ ముందుకు సాగలేదు. ఈ తరుణంలో ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆచంటలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. అయినా ఇప్పటి వరకూ ఏర్పాటుకు ఎటువంటి సన్నాహాలు లేక పోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కలగానే దక్షిణ కాశీ శ్మశానవాటిక

దక్షిణ కాశీగా పేరుగాంచి సిద్ధాంతం కేదారీ ఘాట్ శ్మశానవాటిక అభివృద్ధి కలగానే మిగగిలి పోయింది. ప్రభుత్వ పరంగా ఎటువంటి నిధులు వచ్చే అవకాశం కనుచూపుమేరలో కనిపించే పరిస్థితి కనిపించడం లేదు. శ్మశాన వాటిక అభివృద్ధిలో భాగస్వాముల్యు కావాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అదే విధంగా కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు గ్రామగ్రామాన హామీల వర్షం కురిపించినా, నేటి వరకూ ప్రతిపాదనలు చేయకపోవడం దురదృష్టకరమంటూ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో 100 రోజుల పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

## క్లుప్తంగా

### వంటగ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి

**నరసాపురం:** వంట గ్యాస్ వినియోగంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భారత్ గ్యాస్ డీలర్ నెక్కంటి కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని వశిష్ట స్కూల్‌లో వంటగ్యాస్ సిలిండర్ వాడకం, ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాత్రి పూట కచ్చితంగా సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక భారత్ గ్యాస్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, గ్యాస్ మెకానిక్స్ పి.శ్రీనివాస్, కె.సతీస్, కె.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఏఎస్ఎన్ఎం కళాశాలలో అల్జీమర్స్ దినోత్సవం

**పాలకొల్లు సెంట్రల్:** అల్జీమర్స్ అనే వ్యాధి ముఖ్యంగా వంశపారంపర్యంగా సంక్రమిస్తుంటుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, హెల్త్ కేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టి.కృష్ణ మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి వల్ల మెదడులోని నాడీ కణాలు నిర్వీర్యమైపోతాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.రామకృష్ణ, పి.జ్యోత్స్న, పి.శ్రీనివాసరావు, పి.శిరీష కుమారి తదితరులు పాల్గొన్నారు.

### చెడు వ్యసనాల వల్ల ఉజ్వల భవిష్యత్ నాశనం

**నరసాపురం రూరల్:** విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అడిషనల్ ఎస్పీ (ఎస్డీపీఓ) ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన నరసాపురం రూరల్ సీఐ జి దుర్గాప్రసాద్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నిత్యం ఏదో ఒక పనిని చేస్తూ ఉంటే చెడు ఆలోచనలు మెదడులోనికి రాకుండా ఉంటాయని సూచించారు. సదస్సులో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపిచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విస్సా మాణిక్యాలరావు తదతరులు పాల్గొన్నారు.

### వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం


వడలి ఊరేగింపులో పాల్గొన్న యువకులు

**పెనుగొండ:** వడలి బస్టాండ్ సెంటర్‌లో గణేష్ నిమజ్జనోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా బస్టాండ్‌లో కొలువు తీరిన గణపతి పూజలందుకున్న అనంతరం ఆదివారం ఉదయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. బేతాళ నృత్యాలు, తీన్‌మార్, సంప్రదాయ వాయిద్యాలతో, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు అనంతరం, సిద్ధాంతం వశిష్టా గోదావరిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు.

### ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే లడ్డూ రాజకీయం


గోవిందరాజులనాయుడు

**పాలకొల్లు అర్బన్:** ఎన్నికల హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించడం కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులనాయుడు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారంటూ నీచరాజకీయాలకు పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి నిజనిర్ధారణ చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరాజుల నాయుడు డిమాండ్ చేశారు.

### తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**మొగల్తూరు:** అధిక వర్షాల కారణంగా తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపడితే వాటిని నివారించవచ్చని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. శనివారం మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం-2 సచివాలయ పరిధిలోని వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి పంటపై పాము పొడ తెగులు వ్యాపిస్తే హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్, వాలిడా మైసిన్ 1 ఎంఎల్, ప్రొపికోనజోల్ 0.4 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆకుముడత ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాన్ట్ ట్రిప్రోల్ 0.3 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

### వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

**నరసాపురం రూరల్:** మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ముఖ్యంగా ఆలయ అర్చకులు స్వామి వారిని విశేషంగా అలకరించారు. స్వామి వారి దర్శన అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆలయ ఆవరణలో అన్నప్రసాదం అందించారు.

### గురజాడకు ఘన నివాళి


కొత్తపేట పాఠశాలలో గురజాడ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

**పాలకొల్లు సెంట్రల్:** ఆధునిక తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి మార్గదర్శకులు గురజాడ వెంకట అప్పారావు అని డీఎన్నార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ భాషా వేత్త, తెలుగు సాహిత్యంలో వాడుక భాషను ప్రవేశపెట్టి చిరస్మరణీయమైన రచనలు చేశారన్నారు. అలాగే స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో గురజాడ అప్పారావు 162వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ఎం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, డీఎన్నార్, ఎఎస్ఎన్ఎం కళాశాల అధ్యాపకులు నోబుల్ రాజ్, మమత, రేవతి, కె.భద్రాచలం, తదితరులు పాల్గొన్నారు.

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణంలోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. శనివారం కార్యాలయంలో సిబ్బంది తమ విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా కంప్యూటర్ రూంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి మీటరు కాలిపోయి కిందపడిపోయింది. అక్కడే దస్తాలు ఉండడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమై ముందుగా అక్కడ ఉన్న రికార్డులను భద్రపరిచారు. అనంతరం ఫైర్ ఎక్సిస్టర్ యంత్రాలతో మంటలను అదుపు చేశారు. రిజిస్ట్రార్ ఎం భూషణం మాట్లాడుతూ సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఈ ప్రమాదం రాత్రి సమయంలో జరిగితే పరిస్థితి ఏంటి? అని స్థానికులు చర్చించుకున్నారు.

## పోషకాహారంతో మెరుగైన సమాజం


నరసాపురం రూరల్: రాజుల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**మొగల్తూరు:** గర్భిణులు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వవచ్చని సీడీపీఓ బి.ఊర్మిల తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా శనివారం రామన్నపాలెం గ్రామంలోని ఇందిరా కాలనీలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి కిశోర బాలికలే రేపటి తరానికి తల్లులని, వారి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

**రాజుల్లంకలో..**

**నరసాపురం రూరల్:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రాజుల్లంక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ డి.విజయలక్ష్మి మొక్కలు నాటారు.

## నత్తారామేశ్వరం ఆలయ గోపురం పునఃప్రారంభం


దాత ఎల్లారీశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న పితాని సత్యనారాయణ

**పెనుమంట్ర:** మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో ఉన్నన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ గోపురం శనివారం పితాని సత్యనారాయణ పునఃప్రారంభించారు నత్తరామేశ్వరం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు తాత కుంట్ల ఎల్లారీశ్వరరావు దంపతులు సహకారంతో శిథిలావస్థకు చేరుకుంటున్న గోపురాన్ని రూ.9 లక్షలు వ్యయంతో మరమ్మతులు చేయించి రంగులతో సుందరీకరించారు. ఈ సందర్భంగా దాత తాతకుంట్ల ఎల్లారీశ్వరరావు దంపతులను గ్రామస్తుల తరఫున ఘనంగా సత్కరించారు. ఆలయ ఆవరణలో ఎల్లారీశ్వరరావు దంపతులు శాంతి హోమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు టీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

**హామీలన్నీ నెరవేరుస్తాం**

**పెనుగొండ:** ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం సిద్ధాంతం ఉన్నత పాఠశాలలో ఆచంట మండలం కొడమంచిలిలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచ్ చింతపల్లి గనిరాజు, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే దక్షిణ కాశీగా పేర్గాంచిన సిద్ధాంతం శ్మశాన వాటిక అభివద్ధి పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం శ్మశాన వాటికను పరిశీలించారు.

## తిరుమల వెంకన్నపై రాజకీయం దారుణం


కొవ్వూరి వేణుమాధవ రెడ్డి

**పెనుగొండ:** తిరుమల వేంకటేశ్వర స్వామిపై చంద్రబాబు రాజకీయం చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజ విభాగ కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవ రెడ్డి విమర్శించారు. శనివారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెపం వేసి రాజకీయం చేయాలని చంద్రబాబు కుయుక్తులతో రాజకీయం చేసి వేంకటేశ్వరస్వామి ప్రతిష్టకు భంగం కలిగించి మహాపరాధం చేసారన్నారు. టీటీడీ క్షుణ్ణంగా మూడు శాంపిల్స్‌ను వేర్వేరుగా పరీక్షలు చేయించిన తరువాతే ప్రసాదానికి నెయ్యిని వాడుతుందని, కల్తీ ఉంటే నెయ్యి ట్యాంకర్‌నే అనుమతించరని వివరించారు. కానీ, కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలు భక్తులు తినేశారని కట్టుకథలు అల్లి ప్రచారం చేయడం ధర్మమేనా అని చంద్రబాబును ప్రశ్నించారు. మన గుడిని మన దేవుడిని మనమే తగ్గించుకోవడం కంటే దారుణ పరిస్థితి ఎక్కడైనా ఉందా? అన్నది ప్రజలు ఆలోచించాలని కోరారు.

## పరిశుభ్రతే సమాజ అభివృద్ధికి నాంది



నరసాపురం: స్వచ్ఛత హీ సేవ ర్యాలీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలలో స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**నరసాపురం:** పరిశుభ్రతే సమాజ అభివృద్ధికి నాంది అని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శనివారం పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌కు పీపీఈ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

**శివదేవునిచిక్కాలలో..**

**పాలకొల్లు అర్బన్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవనం సాగించవచ్చని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. మండంలోని శివదేవునిచిక్కాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. మనస్సు స్వచ్ఛంగా ఉంటే చేసే పనులు కూడా స్వచ్ఛతగా ఉంటాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి వి.వరప్రసాద్, సర్పంచ్ దిడ్డ మణివజ్రం, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కేబీకే రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**వడలిలో..**

**పెనుగొండ:** వడలి పంచాయతీ వద్ద శనివారం స్వచ్ఛతాహీ సేవ-2024 సర్పంచ్ కాసాని విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించచారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాషింగ్ ప్రాధాన్యతలను వివరించారు.

## మేడపాడులో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఇన్‌చార్జి హెచ్ఎం పూలపల్లి వేణుగోపాలాచారి

**యలమంచిలి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో మండల స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం యలమంచిలి హైస్కూల్లో శనివారం మేడపాడు హైస్కూల్లో నిర్వహించారు. యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు జరుగగా, మేడపాడు హైస్కూల్లో శనివారం వాలీబాల్, చదరంగం విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇక్కడి విజేతలకు 23, 24 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని ఫెడరేషన్ పాలకొల్లు నియోజకవర్గ కార్యదర్శి రేలంగి రామకృష్ణ తెలిపారు. ముందుగా క్రీడాకారులను హెచ్ఎంలు చింతా చిట్టిబాబు, పూలపల్లి వేణుగోపాలాచారి పరిచయం చేసుకున్నారు. అండర్-17 బాలుర విభాగంలో వాలీబాల్‌కు 12 మంది క్రీడాకారులను, అండర్-14 బాలుర విభాగంలో వాలీబాల్‌కు 14 మంది క్రీడాకారులను, అండర్-17 చదరంగం బాలుర విభాగంలో మేడపాడు విద్యార్థి ఆర్.నాగరాజు, బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని పి.రేచల్ జోయ్, అండర్-14 చదరంగం బాలుర విభాగంలో శిరగాలపల్లి విద్యార్థి పి.రమణ, బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని రాజ్యలక్ష్మి, అండర్-17 వాలీబాల్ బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని పి.విష్ణు నాగప్రియ, అండర్-14 వాలీబాల్ బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని బి.వైష్ణవిలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ మండల కార్యదర్శి యాండ్ర సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు కాసా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బొంతు కల్యాణి, భాస్కర్, వినాయక్ సహకారం అందించారు.

## ఉండి ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


నన్నేటి పుష్పరాజ్


ఉచ్చుల స్టాలిన్

**పెనుగొండ:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలను అతి దారుణంగా చింపేసిన ఉండి శాసన సభ్యుడు రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆచంటలో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలవడానికి అన్ని వర్గాలు కృషి చేశాయన్నారు. అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కారణమే డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని గ్రహించాలన్నారు. నిజంగా గ్రామంలో ఇబ్బందులు ఉంటే పెద్దలతో కూర్చుని మాట్లాడాలి తప్ప ఫ్లెక్సీ చింపే సంస్కృతిని మానుకోవాలని హితవు పలికారు.

**రఘురామకృష్ణంరాజు పై కేసు నమోదు చేయాలి**

**యలమంచిలి:** ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించిన ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ఫ్లెక్సీని ప్రజాస్వామ్యం బద్ధంగా ప్రజల చేత ఎన్నిక కాబడిన ఒక ఎమ్మెల్యే చించి వేయడం రాజ్యాంగాన్నే అవమానించినట్లేనని స్టాలిన్ మండిపడ్డారు.

## అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు


లక్ష్మణేశ్వరం గ్రామంలో బాణసంచా తయారీ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్

**నరసాపురం రూరల్:** ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శనివారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో బాణసంచా తయారీ యూనిట్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలను బాణసంచా తయారీలో ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జేసీ వెంట నరసాపురం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ జెజవాడ సీతారత్నం, వీఆర్‌ఓ చిరంజీవి ఉన్నారు.

**త్వరలో కాళీపట్నం భూముల సమస్య పరిష్కారం**

మొగల్తూరు మండలం కాళీపట్నం ఎస్టేట్ భూముల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామానికి విచ్చేసిన ఆయన రైతుల అభిప్రాయాలను తెలుసుకుని వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్డీఓ అంబరీష్, తహసీల్దార్ విద్యాపతి ఉన్నారు.

### ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**పాలకొల్లు సెంట్రల్:** ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహినట్లు క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మధన్ తెలిపారు. శనివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు నందు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు అనంతరం విజేతలకు మూర్తీస్ జనరల్ స్టోర్స్, నరేష్ టెక్నాలజీస్ సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్, వేరుకొండ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ....**

అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంఎంకేఎస్ఎం హైస్కూల్ నందు 9వ తరగతి విద్యార్థులకు కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి, దేవరపు కాంచనమాల, గణేశ్న రాధ, మండల లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.